ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 22 ఆగస్టు 2024



- ఆలయ అభివృద్ధి పట్టని గత వైసీపీ సర్కారు
- శంకుస్థాపనకే పరిమితమైన పుష్కరిణి పనులు
- కారుచౌకగా దేవస్థానం భూములు లీజుకు..
- దుకాణాల అద్దెలు కూడా నామమాత్రమే..
- అప్పటి అధికారుల తీరుపై తీవ్రమైన విమర్శలు
- కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేయాలని భక్తుల విజ్ఞప్తి

అరసవల్లి.. ఆ ఐదేళ్లు!


అరసవల్లి ఆదిత్యుడి ఆలయం

దేశంలో ప్రాశస్త్యం కలిగిన దేవాలయాల్లో అరసవల్లి శ్రీసూర్యభగవానుడి ఆలయం ఒకటి. ప్రత్యక్ష దైవంగా భావించే ఆదిత్యుడ్ని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆలయం ఈసమెత్తు కూడా అభివృద్ధి చెందలేదు. పైగా రాజకీయ జోక్యంతో ఆలయ అధికారుల అక్రమాలు చర్చనీయాంశమయ్యాయి. ఆలయ అభివృద్ధి లేక.. భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. కేవలం సమీక్షలతో కాకుండా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

వైసీపీ పాలనలో అరవసల్లి ఆదిత్యుడి ఆలయ ప్రతిష్ఠ మసకబారింది. గత ఐదేళ్లు కనీస స్థాయిలో అభివృద్ధి కరువైంది. దీనికితోడు రాజకీయ జోక్యం, అధికారుల తీరు విమర్శలకు దారి తీసింది. ఫలితంగా దైవదర్శనానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆదిత్యుడి ఆలయాన్ని ఏడో శతాబ్దంలో నిర్మించారు. ఏడాదికి రెండుసార్లు ఆలయంలో స్వామి మూలవిరాట్‌ను నేరుగా సూర్యకిరణాలు తాకుతాయి. ఏటా రథసప్తమి నాడు లక్షలాది భక్తులు స్వామిని దర్శించుకుంటారు. చైత్ర శుద్ధ ఏకాదశి, స్వామి వార్షిక కళ్యాణం, కార్తీక శుద్ధ ద్వాదశి, తెప్ప తిరునాళ్లు, మాఘ శుద్ధ సప్తమి వంటి రోజుల్లోనూ భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. కాగా.. ఆలయానికి స్థిర ఆస్తులున్నా, మరోవైపు ఆదాయం వస్తున్నా.. ఆ స్థాయిలో మాత్రం భక్తులకు సౌకర్యాలు కల్పించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● కారుచౌక భూములంటే ఇవే సుమీ...

ఆదిత్యుడి దేవస్థానానికి చెందిన మిగిలిన 26.55 ఎకరాలు శ్రీకాకుళం చుట్టుపక్కనే ఉన్నాయి. సాగునీటి సౌకర్యం కూడా ఉన్న ఈ విలువైన భూములను అత్యంత కారుచౌకగా లీజుదారులకు కట్టబెట్టేశారు. ఏడాదికి ఈ భూమి ద్వారా వచ్చే లీజు కేవలం రూ.2,07,200 మాత్రమే. అంటే ఎకరాకు కేవలం రూ.7969 మాత్రమే. ఏళ్ల తరబడి సాగుచేస్తున్న వారికే లీజుకు ఇచ్చేసి.. అనధికారికంగా ఆదాయం దేవస్థానానికి సమకూర కుండా అధికారులే యత్నిస్తున్నారు. లీజు పెంపుపై ఆలోచన కానీ, ప్రతిపాదన కూడా చేయడం లేదు. ఇటీవల సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు.. ఇదే విషయమై ఆదిత్య ఆలయ ఈవోను తూర్పార బట్టేశారు. ఏకపక్షంగా ఆలయ భూములు లీజుకు ఇస్తూ.. వాటిని పొడిగిస్తూ.. తెరవెనుక అధికారులు లబ్ధి పొందుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇక ఆదిత్యుడి ఆలయానికి ఎదురుగా దేవస్థానానికి చెందిన దుకాణాలు ఉన్నాయి. వీటిని కూడా నామమాత్రపు అద్దెతోనే.. ఎటువంటి వేలంపాట వేయకుండా గతంలో ఉన్నవారికే కట్టబెడుతున్నారు. ఇందులో అభి మానులు ఉంటే వారికి దుకాణం కేటాయించి.. పెద్ద మనసు చాటుకుంటున్నారు అధికారులు. మొత్తం పది దుకాణాలు ఉండగా.. వాటి ద్వారా ఏడాదికి వచ్చే ఆదాయం రూ.6.56 లక్షలు మాత్రమే. అంటే ఒక్కో దుకాణానికి నెలకు రూ.5,470 చొప్పున చెల్లిస్తున్నట్లు స్పష్టమవు తోంది. శ్రీకాకుళం నగరానికి దూరంగా కూడా ఇంత చౌకగా దుకాణాలు అద్దెకు లభించవు.

● మూలకు చేరిన 'మాస్టర్ ప్లాన్'...

2014-2019 మధ్య కాలంలో అప్పటి సీఎం చంద్రబాబు.. అరసవల్లి ఆదిత్యుడి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. 2016లో ఆలయాన్ని స్వయంగా పరిశీలించి మాస్టర్‌ప్లాన్‌పై ఆయన చర్చించారు. తక్షణమే చర్యలు తీసుకుని ప్రతిపాదన పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి ప్రభుత్వానికి పంపారు. తిరుపతి మాదిరి ఆలయంతోపాటు.. అన్ని మాఢవీధులు స్పష్టంగా కనిపించేందుకుగాను మొత్తం 6.67 ఎకరాల భూమి అవసరమని గుర్తించారు. ఇందులో దేవస్థానానికి చెందిన 4.05 ఎకరాలు.. డీసీఎంఎస్‌కు చెందిన 2.07 ఎకరాలు.. ప్రైవేటు భూమి 0.55 సెంట్లు మాత్రమే గుర్తించి ప్రణాళిక సిద్ధం చేశారు. దశలవారీగా మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఫేజ్-1లో కేవలం 0.25ఎకరాల విస్తీర్ణంలో దేవాలయానికి ఎదురుగా నివసిస్తున్న 11 కుటుంబాలకు మరోచోట భూమిని సమకూర్చి వారిని అక్కడకు పంపాలని నిర్ణయం తీసుకుంది. ఫేజ్-2లో 2.07 ఎకరాల ప్రైవేటు భూమిని పుష్కరిణీ అభివృద్ధి కోసం కొనుగోలు చేయాల్సి ఉంది. ఇందుకోసం అప్పట్లో ఆర్డీఓ ద్వారా ప్రతిపాదన పంపారు. ఫేజ్-3లో టీటీడీ భవనాన్ని కూల్చివేసి.. మాఢవీధులకు ఆనుకుని ఉన్న 52 ఇళ్లను ఖాళీచేయించి.. వారికి సరైన పునరావాసం కల్పించాల్సి ఉంది. ఇది అమలు చేయలేకపోయారు. ప్రతిపాదనలతోనే అన్ని దశలు ఆగిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆదిత్యుని అభివృద్ధే మరిచింది. మాస్టర్‌ప్లాన్‌ను మూలకు చేర్చేసింది.

ఆదాయం.. భూముల వివరాలివీ...

ఆదిత్యుడి పేరిట వివిధ బ్యాంకుల్లో రూ.42,52,41,667 డిపాజిట్ ఉంది. అలాగే ఆదిత్యుని ఆలయానికి భక్తులు, దాతల నుంచి 2020-21 సంవత్సరంలో రూ.7.42కోట్లు, 2021-22లో రూ.2.41కోట్లు, 2022-23లో రూ.6.61కోట్లు, 2023-24లో రూ.8.41కోట్లు ఆదాయం లభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో (2024-25) రూ.11.26కోట్లు ఆదాయం చేకూరనుందని ఆలయ అధికారులు అంచనా వేశారు.

● భూముల విషయానికొస్తే.. మొత్తం 83.99 ఎకరాలు ఉన్నాయి. ఇందులో అర్చకుల ఆధ్వర్యంలో 57.44 ఎకరాల భూములు ఉన్నాయి. అర్చక సిబ్బందికి వేతనాలు ఉండవు. ఈ భూములపై వచ్చే ఫలసాయంపైనే వారు ఆధారపడతారు. ఈ భూములను సర్వీసు ఈనాముగా గుర్తించారు. వీటిపై ఎటువంటి ఆదాయం దేవస్థానానికీ ఉండదు.

● ఉన్నతాధికారి తీరుపై విమర్శలు..

ఆదిత్యుడి ఆలయంలో ప్రస్తుతం ఓ ఉన్నతాధికారి అత్యంతగా విమర్శలు పాలవుతున్నారు. అనుమతులు లేకుండా అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నవారితో చెట్టాపట్టాలేసుకుంటూ.. పలుకుబడి ఉపయోగించుకుని తిష్ట వేసిన రిటైర్డ్ ఉద్యోగితో అక్రమాలకు పాల్పడుతున్నారని విశ్వసనీయ సమాచారం. చాన్నాళ్ల కిందట తొలగించిన ఓ ఉద్యోగిని వెంటబెట్టుకుని ఇటీవల విజయవాడ వెళ్లారు. అంతకుమునుపు తొలగించిన తాత్కాలిక ఉద్యోగులను కొంతమందిని విధుల్లోకి తీసుకోవాలని దేవదాయశాఖ ఉన్నతాధికారులను కోరినట్లు సమాచారం. సిబ్బంది వెర్సస్ ఉన్నతాధికారి అన్నట్లుగా అక్కడ పరిస్థితి తయారైంది. ఆదిత్యుని ఆలయ అభివృద్ధిపై కాకుండా.. వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ.. దుకాణాలు, భూముల వేలం విషయాల్లోనూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఉందని భక్తులు పేర్కొంటున్నారు. మంత్రి, ప్రజాప్రతినిధులు స్పందించి ఆలయ అభివృద్ధిపై శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

చుక్క నీరు లేని ఇంద్రపుష్కరిణి...

ఆదిత్యుడి ఆలయానికి ఎదురుగా ఉన్న ఇంద్ర పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే వారు. కానీ, ప్రస్తుతం పుష్కరిణిలో చుక్కనీరు కూడా లేకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రెవెన్యూమంత్రి హోదాలో ఇంద్ర పుష్కరిణి పనులను చేపట్టేందుకు గతేడాది ధర్మాన ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. రూ.3,28,64,208 నిధులతో పుష్కరిణిని ఆధునికీకరించేందుకు కార్యాచరణ ఆరంభించారు. కర్ణాటకకు చెందిన ఓ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. పనులు మాత్రం పది శాతం కూడా చేపట్టలేదు. మళ్లీ ప్రతిపాదనలు మార్చి గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వానికి పంపారు. కానీ కార్యరూపం దాల్చలేదు. వైసీపీకి చెందిన వీర అనుచరులు.. దేవస్థానంలో పాలక మండలి సభ్యులుగా చోటు దక్కించుకున్నారు. చేసిన అభివృద్ధి మాత్రం సున్నా.




మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

జాతీయ లోక్‌అదాలత్.. ఓ సువర్ణావకాశం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, ఆగస్టు 21: జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. 'వచ్చే నెల 14న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నాం. జిల్లా ప్రజలకు ఇదొక సువర్ణావకాశం. కోర్టుల్లో ఎప్పటి నుంచో ఉన్న కేసులను రాజీ చేసుకుని.. కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు లోక్ అదాలత్ పనిచేస్తుంది. అధిక సంఖ్యలో క్రిమినల్, సివిల్, బ్యాంకులకు సంబంధించి కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాల'ని సూచించారు. ఎక్కువ కేసులు రాజీ చేయాలని న్యాయమూర్తులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎస్ఎం. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్ ఆగస్టు 21: జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్-(ఎఫ్‌పీవో))ల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంస్థ జిల్లా మోనటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మెరుగైన, నాణ్యమైన పంటలను ఉత్పత్తి చేయడానికి రైతులను ప్రోత్సహించాలి. సాంకేతికత, మార్కెటింగ్ సౌకర్యం కోసం సన్న, చిన్నకారు రైతులు.. ఉత్పత్తిదారుల సంస్థలో చేరితే మంచి ఫలితాలు ఉంటాయి. అధికారులు దీనిపై అవగాహన కల్పించాలి. ఆర్థిక బలంతో పాటు మార్కెట్ అనుసంధానం పెంపొందించుకోవడానికి ఎఫ్‌పీవోలు దోహదపడతాయి. జిల్లాలో ప్రస్తుతం నాబార్డు, వివిధ సంస్థల ఆధ్వర్యంలో 32 ఎఫ్‌పీవోలు పనిచేస్తున్నాయి. కొత్తవి ఏర్పాటు చేయడానికి రైతులు ముందుకు రావాలి. జిల్లాలో పాలు, కూరగాయలు, జీడిమామిడి, కొబ్బరితోపాటు ఉద్యాన పంటల మార్కెటింగ్‌పై ఎఫ్‌పీవోలు దృష్టి పెట్టాలి. పంట ఉత్పత్తుల నిల్వకు కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలి. రైతుబజార్లలో రిటైల్ దుకాణాలు ఇవ్వాలి. లైసెన్సులు సులభతరం చేయాలి' కలెక్టర్ తెలిపారు. సమావేశంలో వ్యవసాయాధికారి కె.శ్రీధర్, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీసీసీబీ సీఈవో వరప్రసాద్, లీడ్‌బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, నాబార్డు డీడీఎం కృష్ణ, కృషి విజ్ఞానకేంద్ర కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, పశుసంవర్థక శాఖ జేడీ జయరాజు, రెడ్‌క్రాస్ జగన్మోహనరావు, ఎఫ్‌పీవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో తరగతులు

ఎచ్చెర్ల, ఆగస్టు 21: ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం క్యాంపస్‌లో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గురువారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని క్యాంపస్ పరిపాలనాధికారి ముని రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'ఇక్కడి క్యాంపస్‌లో మొత్తం 941 మంది అడ్మిషన్ పొందగా, ఇందులో 639 మంది బాలికలు, 302మంది బాలురు ఉన్నారు. వీరిలో బుధవారం సాయంత్రం నాటికి 568 మంది బాలికలు, 255 మంది బాలికలు మొత్తం 823 మంది రిపోర్ట్ చేశారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల్లో విద్యార్థులు మారేందుకు అవకాశం ఉండడంతో మిగిలినవారు చేరలేదు. మూడో విడత షెడ్యూల్ ఒకట్రెండు రోజుల్లో విడుదలవుతుంద'ని రామకృష్ణ వెల్లడించారు.

అవినీతి పోలీసులపై ప్రత్యేక దృష్టి

● లంచం తీసుకున్న కానిస్టేబుల్ సస్పెన్షన్

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 21: జిల్లాలోని వివిధ స్టేషన్ల పనిచేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న పోలీసు అధికారులు, సిబ్బందిపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అవినీతి ఆరోపణలు వస్తున్న కొన్ని పోలీసుస్టేషన్లపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా ఒడిశా నుంచి మద్యం తీసుకువస్తున్న ఓ వ్యక్తిని బెదిరించి రూ.5 వేలు లంచం తీసుకున్న ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. పాతపట్నం పోలీసుస్టేషన్‌లోని కానిస్టేబుల్ శ్యామలరావు.. ఇటీవల ఒడిశా నుంచి అక్రమంగా మద్యం తీసుకొస్తున్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. ఆయనను బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. మద్యంతోపాటు రూ.5వేలు లంచం తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి స్పెషల్‌బ్రాంచ్ పోలీసులతో విచారణ చేశారు. లంచం తీసుకోవడం వాస్తవమని తేలడంతో కానిస్టేబుల్ శ్యామలరావును సస్పెండ్ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. పోలీసుశాఖలో అవినీతికి పాల్పడితే ఉపేక్షించేది లేదని అధికారులను ఎస్పీ హెచ్చరించినట్లు భోగట్టా. ఇప్పటికే జిల్లాలో అన్ని పోలీసుస్టేషన్లను సందర్శించిన ఎస్పీ.. కొంతమంది పోలీసులపై నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే కానిస్టేబుల్ శ్యామలరావు భాగోతం బట్టబయలైనట్లు సమాచారం.

తీర ప్రాంత భద్రతపై అప్రమత్తం

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


సంతబొమ్మాళి, ఆగస్టు 21: తీరప్రాంత మైరెన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. బుధవారం నౌపడ, భావనపాడు మెరైన్ పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సముద్రం గుండా వచ్చే చొరబాటుదారులను గుర్తించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. భావనపాడు తీరానికి వచ్చే పర్యాటకులు.. సముద్రం లోపలికి వెళ్లకుండా భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నౌపడ ఎస్ఐ కిషోర్‌వర్మ ఉన్నారు.


నౌపడ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

వైసీపీ నేత ఇంట్లో.. ఎరువులు సీజ్


డీజీ పురంలో సీజ్ చేసిన ఎరువులతో అధికారులు

కంచిలి, ఆగస్టు 21: కంచిలి మండలం డీజీ పురానికి చెందిన వైసీపీ నేత లడ్డు కేశవ్ పాత్రో ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 62 బస్తాల ఎరువుల నిల్వలు పట్టుబడ్డాయి. యూరియా, డీఏపీ అక్రమ నిల్వలపై సమాచారం అందగా.. బుధవారం మండల వ్యవసాయాధికారి ధనుంజయ, వీఆర్వో, వీఏఏతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. కేశవ్‌పాత్రో ఇంట్లో 20-20-0-3 రకం 50 బస్తాల యూరియా, 12 బస్తాల డీఏపీ ఉన్నట్టు గుర్తించారు. వీటిపై ప్రశ్నించగా.. తన పొలానికి అవసరమని.. వాటిని కొనుగోలు చేసినట్టు కేశవ్‌పాత్రో తెలిపారు. ఎరువులకు సంబంధించి బిల్లులు అడగ్గా.. వాటిని చూపించలేకపోయారు. దీంతో ఆ యూరియా, డీఏపీ నిల్వలు సీజ్ చేశామని మండల వ్యవసాయశాఖాధికారి ధనుంజయ తెలిపారు. సరైన బిల్లులు సమర్పిస్తే.. తిరిగి వాటిని అప్పగిస్తామన్నారు. తనిఖీల్లో వ్యవసాయశాఖ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




లొద్దపుట్టి పాఠశాలలో మరుగుదొడ్లు..

ఉపాధ్యాయులు హ్యాపీ..


- గురువులకు తప్పిన మరుగుదొడ్ల యాప్ బాధ
- గతంలో ఆత్మాభిమానాన్ని హరించిన వైసీపీ
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

(ఇచ్ఛాపురం)

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వైసీపీ పాలనలో వివిధ యాప్‌లతో ఒత్తిడికి గురయ్యేవారు. ప్రధానంగా మరుగుదొడ్ల ఫొటోలు కూడా తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించడంతో మానసిక వేదన పడేవారు. సమావేశాల్లో సైతం మరుగుదొడ్లు సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించేవారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల యాప్ నుంచి విముక్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

● వైసీపీ ప్రభుత్వం 'నాడు-నేడు' పథకంలో భాగంగా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. మరుగుదొడ్లు నిర్మించింది. 2021 ఏప్రిల్‌లో ఐఎంఎంఎస్ యాప్ ప్రవేశపెట్టి అందులో మరుగుదొడ్ల ఫొటోలు ఉదయం అప్‌లోడ్ చేయాలని షరతు విధించింది. ఈ మేరకు ఫ్లోరింగ్, వాష్‌బేసిన్, బాలురు, బాలకల మరుగుదొడ్లు ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. సిగ్నల్స్ లేక సకాలంలో అప్‌లోడ్ చేయకపోయినా.. ఉన్నతాధికారులకు వివరణ ఇవ్వాల్సి వచ్చేది. ఇది ఉపాధ్యాయులకు తలనొప్పిగా పరిణమించింది. తీరా ఫొటోలు అప్‌లోడ్ అయి ఎక్కడైనా మరుగుదొడ్లు సక్రమంగా లేకపోతే అధికారుల నుంచి హెచ్చరికలు ఎదురయ్యేవి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు బోధనకు దూరమై మరుగుదొడ్లపైనే ఎక్కువ శ్రద్ధ చూపేవారు. అనేక ఉపాధ్యాయ సంఘాలు మరుగుదొడ్ల యాప్ భారం నుంచి ఉపాధ్యాయులుకు దూరం పెట్టాలని సూచించినా వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. ఉపాధ్యాయుల విన్నపాలను పెడచెవిన పెట్టి వారి ఆత్మాభిమానాన్ని దెబ్బతీసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ నెల మొదటి వారంలోనే ఐఎంఎంఎస్ యాప్‌లో టీఎంఎఫ్ టైల్‌ను తొలగించింది. మరుగుదొడ్ల ఫొటోలను ఉపాధ్యాయులు తీయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఆత్మాభిమానాన్ని చంపుకొని అడ్డమైన పనులు చేసిన తమ బాధను కూటమి ప్రభుత్వం అర్థం చేసుకుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఇకపై తమ పూర్తి సమయాన్ని బోధనకు కేటాయించవచ్చునని చెబుతున్నారు.

● హర్షణీయం



ఉపాధ్యాయులకు అనుకూలంగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల అప్‌లోడ్ బాధ్యతను తప్పించడం హర్షణీయం. కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘం తరఫున కృతజ్ఞతలు.

-ఆర్వీ అనంతాచార్యులు, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు



తిరుమలలో చిరంజీవి

● కుటుంబ సభ్యులతో కలసి నేడు శ్రీవారి దర్శనం

మెగాస్టార్ చిరంజీవి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 8గంటలకు తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులతో పాటు అభిమానులు స్వాగతం పలికారు. చిరంజీవితో పాటు ఆయన సతీమణి సురేఖ, తల్లి అంజనా దేవి కూడా తిరుమలకు చేరుకున్నారు. అంతకుముందు సాయంత్రం కుమార్తె శ్రీజ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో వేకువజామున జరిగే సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకోనున్నారు.


తిరుమల, (ఆంధ్రజ్యోతి)

బ్లాక్‌బస్టర్ పక్కా



నాని, ప్రియాంక మోహన్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్.జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నెల 29న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడింది. ఆ కష్టం తెరపై కనపడుతుంది. వారి కోసం ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. ఈ సినిమాకు వివేక్ రైటింగ్, జేక్స్ బిజోయ్ సంగీతం స్పెషల్ అట్రాక్షన్. నాకు కోపం వచ్చింది. అలా కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ పక్కా" అని చెప్పారు. "ఈ సినిమాలో ఎస్.జే. సూర్య, నాని పోటాపోటీగా నటించారు. వివేక్ నుంచి ఇటువంటి కమర్షియల్ సినిమా అస్సలు ఊహించలేదు. సినిమాను డైరెక్టర్ ఓ రేంజ్‌లో తీశారు" అని దిల్‌రాజు అన్నారు. "ఈ సినిమాకు కథే బలం. సినిమా అద్భుతంగా వచ్చింది" అని చిత్ర నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు.

ముఫాసాకు మహేశ్ వాయిస్



ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్న 'ది లయన్ కింగ్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'ముఫాసా ది లయన్ కింగ్' పేరుతో వస్తున్న ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసాకు మహేశ్‌బాబు వాయిస్ అందిస్తుండడం ఆసక్తికరం. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్‌లో పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ 'డిస్నీతో అనుబంధం నాకు ప్రత్యేకమైంది. తన కొడుకు అంటే అభిమానం కలిగిన పాత్ర ముఫాసా. అంతేకాదు అడవికి రారాజు. ఆ పాత్రకు నేను వాయిస్ అందించడం నా పిల్లలతో ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే సందర్భం ఇది' అన్నారు. డిసెంబర్ 24న 'ముఫాసా ది లయన్ కింగ్' విడుదలవుతుంది.



సిద్ధు కోసం శ్రీనిధి

సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, తాజా షెడ్యూల్‌లో శ్రీనిధి జాయిన్ అయ్యారు. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

తెలుగులోనూ ఆదరిస్తారు



హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను భయపెట్టిన 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్‌గా తెరకెక్కిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్.ఆర్.జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను బి.సురేశ్ రెడ్డి, బి.మానస రెడ్డి నిర్మించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీశంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాను తెలుగులోను ఆదరిస్తారు" అని చెప్పారు. "ఈ సినిమాకు కొనసాగింపుగా మరో రెండు భాగాలు ఉంటాయి" అని దర్శకుడు అజయ్.ఆర్.జ్ఞానముత్తు అన్నారు.

అద్భుతమైన కంటెంట్‌తో 'రేవు'



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా.మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రభు దర్శకత్వ పర్యవేక్షణ చేపట్టగా, పి.రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరినాథ్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. అందరూ మెచ్చే చిత్రమిది" అని అన్నారు. "ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎగ్జైట్ అవుతారు" అని నిర్మాత డా.మురళి గింజుపల్లి అన్నారు.

SCHOLARSHIP ALERT

Reliance Foundation Undergraduate

Description: The Reliance Foundation Under graduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, be come successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Students must be enrolled in the first year of a full-time regular undergraduate (UG) de gree in any stream at a recognised Indian institute. ● Must have passed Class 12 with a minimum of 60% marks. ● The annual household income should be up to INR 15,00,000 per year (preference will be given to those students whose family income is less than INR 2,50,000)

● Open for resident Indian citizens only. An aptitude test is mandatory.

Prizes & Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only ***Short Url:*** ww.b4s.in/aj/RFS11

దిక్సూచి

SBIF Asha

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: **Classes 6 to 12:** INR 15,000 each

- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000

Last Date: 01-10-2024 ***Short Url:*** www.b4s.in/aj/SBIFS7

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/LAnmSITలో చదవండి.

బంద్ ప్రశాంతం

జిల్లాలో బుధవారం భారత్‌బంద్ ప్రశాంతంగా జరిగింది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దళిత సంఘాలు భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు జిల్లాలో పలుచోట్ల దళిత సంఘాల నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సుప్రీంకోర్టు తీర్పును వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కాగా, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి.

- ఆంధ్రజ్యోతి బృందం


కొత్తూరు: అంబేద్కర్ కూడలిలో మానవహారం


నరసన్నపేట: అంబేడ్కర్ విగ్రహం వద్ద..


పొందూరు: నినాదాలు చేస్తున్న దళిత సంఘ ప్రతినిధులు


రణస్థలంలో..


టెక్కలి: ర్యాలీ చేపడుతున్నఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ


ఇచ్ఛాపురంలో..

పలాసలోనే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

పలాస/శ్రీకాకుళంక్రైం/కంచిలి/సోంపేట: ఇక నుంచి పలాస పోలీసుస్టేషన్‌లోనే ప్రతీ శుక్రవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, వజ్రపుకొత్తూరు, కోటబొమ్మాళి, మెళియాపుట్టి మండలాల ప్రజలు సుదూరం ప్రయాణించి జిల్లా కేంద్రం శ్రీకాకుళం చేరుకుని తమ సమస్యలను విన్నవించేందుకు కష్టమవుతుందని చెప్పారు. వారి సౌలభ్యం కోసం పలాసలోనే ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీ శుక్రవారం పలాస పోలీసుస్టేషన్‌లో ఉదయం 11.30గంటలకు వినతులు స్వీకరించేందుకు పోలీసు అధికారులు అందుబాటులో ఉంటారని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెగుళ్లను నివారిస్తే అధిక దిగుబడులు

● వ్యవసాయాధికారి లతాశ్రీ

చొర్లంగి(ఎల్.ఎన్.పేట): పంటల్లో తెగుళ్లను గుర్తించి నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి పి.లతాశ్రీ అన్నారు. మండలంలోని చొర్లంగిలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెగుళ్ల నివారణకు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఇచ్చే సలహాలు, సూచనలను రైతులు పాటించాలన్నారు. పురుగు మందులు పిచికారి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది బాలచంద్రుడు, రాకేష్, రైతులు పాల్గొన్నారు.


పొలంబడి కార్యక్రమంనిర్వహిస్తున్న దృశ్యం

డ్రాపౌట్ విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

పలాసరూరల్: మండలంలో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకూ 2,166 మంది డ్రాపౌట్ విద్యార్థులు ఉన్నారని, వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాల సిబ్బంది, సీఆర్‌ఎంటీలు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ డ్రాపౌట్ విద్యార్థుల వివరాలపై దృష్టిసారించి నమోదు చేయాలన్నారు. పది, ఇంటర్‌లో చేరాలనుకునేవారిని గుర్తించి వారిని ఓపెన్ స్కూల్ ద్వారా జాయిన్ చేయాలని తెలిపారు. సమావేశంలో మండల విద్యాశాఖాధికారులు సీహెచ్.శ్రీనివాసరావు, సత్యం, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

టెక్కలి: విద్యార్థులు ఏమి కావాలనుకుంటున్నారో లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఆ దిశగా కృషి చేయాలని రిటైర్డ్ డాక్టర్ బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, యూజే కేరియర్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉద్యోగమైతే ఒకరి వద్ద బానిసగా ఉండాలని, వ్యాపారి అయితే ఆయనే యజమానిగా ఉంటాడని అన్నారు. పెన్సిల్ ముల్లుపై 26 అక్షరాలను 17 నిమిషాల్లో చెక్కి బుక్ ఆఫ్ ఇండియాలో రికార్డు సాధించిన ఆదిత్య విద్యార్థి బోటు వర్షప్రియకు రూ.10వేలు ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ సతీష్‌కుమార్, హెచ్‌వోడీ డాక్టర్ అశోక్‌కుమార్ ఉన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జలుమూరు (సారవకోట): మండలంలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గృహనిర్మాణ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండలానికి 305 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 65 గృహాలు మాత్రమే పూర్తిచేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీల్లో సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రావడం లేదని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగు అసిస్టెంట్లు చెప్పారు. దీనిపై స్పందించిన పీడీ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇక నుంచి వారానికి 7 గృహాల పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ ప్రసాదరావు, ఈవోపీఆర్‌డీ రేణుక, తహసీల్దార్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

బాలలను పనిలో పెట్టరాదు

జలుమూరు (సారవకోట): బాలలను పనిలో పెట్టవద్దని చైల్డ్ హెల్ప్ లైన్ ఏఎల్‌వో జైశంకర్ అన్నారు. సారవకోట, చల్లవానిపేటలోని షాపులను బుధవారం తనిఖీ చేసి యజమానులకు పలు సూచనలు చేశారు. బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని, వారిని ఎవరైనా పనిలో పెడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సారవకోట కేజీబీవీని సందర్శించారు. ఎంఈవో ఎంవీ రమణ, హెచ్‌టీయూ హరి, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్‌వైజరు వైకుంఠరావు, కౌన్సిలర్ సభ్యురాలు సునీత, సర్వశిక్ష అభియాన్ కోఆర్డినేటరు పి.జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

4 లక్షల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

టెక్కలి: జిల్లాలో 4.11లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని నిర్ణయించామని పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ జయరాజ్ తెలిపారు. బుధవారం టెక్కలి పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వచ్చేనెల 18 వరకు క్షేత్రస్థాయిలో 221 బృందాలు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల్లో పాల్గొంటాయన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు సహకరించాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హిరమండలం: గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని చొర్లంగి పీహెచ్‌సీ వైద్యాధికారి యశ్వంత్ అన్నారు. బుధవారం చొర్లంగి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమాజంలో మగ, ఆడ సమానమేనని తెలిపారు. గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

షట్టర్లు ఏర్పాటు చేయాలి

టెక్కలి: వంశధార ప్రధాన ఎడమ కాలువ పరిధిలో షట్టర్లు ఏర్పాటు చేసి శివారు ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు అన్నారు. బుధవారం టెక్కలిలో వంశధార పరిధి రైతాంగంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15ఏళ్లుగా షట్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, 2009లో షట్టర్లు కుంభకోణం వెలుగుజూసిన తరువాత వాటి నిర్మాణం నేటికీ జరగలేదన్నారు. ఇప్పటికే వంశధార గోదాముల్లో 900 టన్నుల షట్టర్లు తుప్పుపడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నంబూరు షణ్ముఖరావు, పాలిన సాంబమూర్తి, కొల్లి ఎల్లయ్య, హనుమంతు ఈశ్వరరావు, లక్ష్మణరావు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే గౌతు శిరీష

మందస: ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా సర్వసభ్య సమావేశానికి హాజరైన శిరీషను సభ్యులు, సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వ హయాంలో రైతులు నిర్లక్ష్యానికి గురయ్యారు. సాగునీటి వనరుల అభివృద్ధిని పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు చేపట్టలేదు. మండలంలో ప్రధాన నీటి వనరులైన దామోదరసాగరం, కళింగదళ్ రిజర్వాయరు, డబార్సింగి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తాం. గత ఐదేళ్లలో రాని వంశధార నీటిని 45రోజుల్లో పలాసకు తీసుకువచ్చాం. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. కుక్కకాటు, పాముకాటు వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలి. శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించి గ్రామాలకు అవసరమైన ఉపాధి పనులను గుర్తించి ప్రణాళిక రూపొందించాలి.' అని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో తిరుమలరావు, ఈవోపీఆర్‌డీ ఎ.రఘుపతిరావు, సివిల్ సప్లయ్‌డీటీ ఎస్.రవి, జడ్పీటీసీ సభ్యుడు సవర చంద్రన్న, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కె.ఆదినారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

మంత్రి అచ్చెన్నను కలిసిన ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును విజయవాడలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం కలిశారు. నియోజవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న ఎత్తిపోతల సమస్యను వెంటనే పరిష్కరించాలని, సరిపడ ఎరువులను ఆర్‌బీకేల్లో ఉంచాలని కోరారు.

పూండి టీడీపీ నాయకులు కూడా..

వజ్రపుకొత్తూరు: మంత్రి అచ్చెన్నను పూండి టీడీపీ నాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, తదితరులు బుధవారం కలిశారు. దేవునల్తాడ నుంచి బెండి గేటు వరకు డబుల్‌రోడ్డు మంజూరు చేయాలని, పూండి బస్టాండ్ వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, గనియా బంద చెరువును అభివృద్ధి చేసి పార్కుగా మార్చాలని మంత్రిని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


ఆర్‌జేడీకి వినతిపత్రం అందిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

పోలాకి: పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలని మోడల్ స్కూళ్ల ఆర్‌జేడీ విజయభాస్కర్ అన్నారు. ఈదులవలస మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న బేస్‌లైన్ టెస్ట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. విద్యా బోధనపై ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమీక్షించారు. బోధనలో మెలకువలు వివరించారు. అనంతరం పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు పెంచాలని అవుట్‌సోర్సింగ్ విభాగ కమిటీ నాయకులు తారకేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎర్రయ్య ఆర్‌జేడీకి వినతిపత్రం అం దించారు. ఎంఈవో శ్రీనివాస నాయక్, ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, సీఆర్‌పీ రమణమూర్తి పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం

మెళియాపుట్టి: మండల సర్వసభ్య సమావేశం బుధవారం తూతూ మంత్రంగా జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోసం ఎదురుచూశారు. ఆయన రాకపోవడంతో అధికారులు వచ్చామా..వెళ్లామా అన్నచందగా సమావేశం నిర్వహించారు. రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, నాడు-నేడు పథకంలో నిలిపోయిన పనులను పూర్తిచేయాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకుమారి, తహసీల్దార్ హనుమంతురావు, కొసమాళ ఎంపీటీసీ సభ్యుడు సలా చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

పాతపట్నం: తామర గ్రామానికి చెందిన అనిత అనే యువతి వివాహానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం ఆర్థిక సాయం చేశారు. రూ.20వేల నగదును ఆమెకు అందజేశారు.

మాజీ వైస్ ఎంపీపీ అన్నపూర్ణమ్మ మృతి

మెళియాపుట్టి: మాజీ వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకురాలు సవర అన్నపూర్ణమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. అన్నపూర్ణమ్మ 2008 నుంచి 2014 వరకు వైస్ ఎంపీపీగా, 2014లో వైసీపీలో చేరి జిల్లా ఎస్టీ మహిళా అధ్యక్షురాలిగా పని చేశారు. 2024 ఎన్నికల్లో టీడీపీలో చేరారు. ఆమె మృతిపై మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గోవిందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి, మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, బైరిశింగి లక్ష్మీనారాయణ సంతాపం తెలిపారు.


అన్నపూర్ణమ్మ (ఫైల్)

విద్యార్థినులకు కంటి పరీక్షలు

సంతబొమ్మాళి: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక కేజీబీవీలో 265మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు బుధవారం నిర్వహించినట్లు సంతబొమ్మాళి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సంధ్యారాణి తెలిపారు. ప్రతి ఏడాది విద్యార్థులు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

నేడు సంతబొమ్మాళి మండల సమావేశం

సంతబొమ్మాళి: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన గురువారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రేమలీల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సంతబొమ్మాళి: నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిరిపురం భీమేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓఏఎస్ వృత్తి విద్యాకోర్సులో టైప్, షార్ట్ హ్యాండ్ సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు ఉన్న అభ్యర్థులు అర్హులని, ఈ నెల 23లోగా కళాశాలలో దరఖాస్తులు అందించాలని కోరారు.

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూప్‌లో కామర్స్-1 అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.సంతోషి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఎంకాంలో 50శాతం ఉత్తీర్ణత ఉన్నవారు అర్హులని చెప్పారు. ఈనెల 23 సాయంత్రం 4 గంటల్లోపు కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్టు లెక్చరర్‌గా పనిచేసేందుకు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమసుందరావు తెలిపారు. అర్థశాస్త్రం బోధించాల్సి ఉంటుందని చెప్పారు.

యూజీసీ నెట్ పరీక్షలు ప్రారంభం

నరసన్నపేట: పట్టణంలోని కోర్ టెక్నాలజీలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 30వరకు రోజుకు రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. బుధవారం 124 మంది హాజరైనట్లు చెప్పారు.

కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు

నరసన్నపేట: కాలం చెల్లిన పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో సునీత దుకాణదారులను హెచ్చరించారు. బుధవారం పట్టణంలో పురుగు మందుల షాపులను ఆమె తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుమందుల నాణ్యతను పరిశీలించేందుకు శాంపిల్స్‌ను సేకరించారు. రైతులకు పురుగు మందులను విక్రయించే సమయంలో తప్పనిసరిగా వారి ఆధార్ నెంబరును బిల్లులో నమోదు చేయాలని సూచించారు. అనుమానం వచ్చే రైతులకు వాటిని విక్రయించవద్దని తెలిపారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

నరసన్నపేట: ఓటర్ల జాబితాల సవరణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆర్వో రామ్మోహన్‌రావు కోరారు. బుధవారం వారితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 20 వరకు బీఎల్వోలు ఇంటింటా సర్వే చేస్తారని, ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనికి రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, టీడీపీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కత్తిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వృద్ధురాలి మృతి

లావేరు: గుర్రాలపాలెంలో బుధవారం పాముకాటుకు గురై బి.వరలక్ష్మి(60) మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. వరలక్ష్మి బుధవారం ఉదయం తన పంట పొలంలో వేసిన సరుగుడి తోటకు గొప్పుతవ్వేందుకు వెళ్లగా పాము కాటు గురై స్పృహతప్పి పడిపోయింది. తర్వాత వెళ్లిన మిగతా కూలీలు ఆమెను చూసి ఊళ్లోవారికి సమాచారం అందించారు. వెంటనే గ్రామస్థులు 108 వాహనం సహాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. వరలక్ష్మికి భర్త ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బస్టాండ్‌లో మహిళ..

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు బస్టాండ్‌లో పోతలు శాంతమ్మ (55) అనే మహిళ బుధవారం మృతి చెందింది. ఎస్‌ఐ సీహెచ్ రామారావు వివరాల మేరకు.. పాతపట్నం మండలం రొంపివలసకు చెందిన శాంతమ్మ బెండిగేటు జంక్షన్‌లోని పూరిగుడిసెలో ఉంటూ, ప్రతిరోజూ వివిధ గ్రామాల్లో తిరుగుతూ కరివేపాకు అమ్ముతుంటుంది. అలాగే యాచక వృత్తి కూడా చేస్తుంటుంది. బుధవారం ఉదయం నువ్వలరేవులో కరివేపాకు విక్రయించి విశ్రాంతి కోసం బస్టాండ్ వద్దకు వెళ్లింది. అక్కడ నిద్రిస్తూ మృతి చెందింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ రామారావు చేరుకొని మృతదేహాన్ని పోస్టు నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శాంతమ్మ భర్త గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో గల్లంతైన యువకుడి మృతి

వెదుళ్లవలస (పోలాకి): స్నానం కోసం మంగళవారం చెరువులోకి దిగి గల్లంతైన వెదుళ్లవలసకు చెందిన అమలాపురం దుర్గారావు అనే యువకుడు మృతి చెందాడు. ఆయన మృతదేహం బుధవారం సాయంత్రం చెరువులో తేలింది. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు గొల్లవాడు, సరస్వతి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్‌ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో జిల్లా యువకుడు..

- విజయవాడ-హైదరాబాద్ రోడ్డులో ఘటన


సంతోష్ (ఫైల్)

జలుమూరు (సారవకోట): జిల్లాకు చెందిన ఓ యువకుడు విజయవాడ- హైదరాబాదు రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలం కుమ్మరిగుంట గ్రామానికి చెందిన సాధు సంతోష్‌కుమార్ (23) హైదరాబాదులోని ఓ స్టూడియోలో పనిచేస్తున్నాడు. కొత్తగా బైక్ కొనుగోలు చేసిన సంతోష్‌కుమార్... విజయవాడ కనదుర్గమ్మను దర్శించుకొని తిరిగి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఇతడికి తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, ఆదినారాయణ ఉన్నారు. విషాదఛాయలు అలముకున్నాయి.

యువకుడి అదృశ్యం


కిరణ్‌కుమార్

కొత్తూరు: నివగాం గ్రామానికి చెందిన వాడ కిరణ్ కుమార్(23) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ మేరకు తల్లి రోహిణి బుధవారం కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. హడ్డుబంగికి చెందిన ఇప్పిలి రామారావుకు చెందిన బొలెరో వాహనానికి కిరణ్ డ్రైవర్‌గా వెళ్లేవాడని, ఈ నెల 19న విధులకు వెళతానని చెప్పి అదృశ్యమైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఎస్‌ఐ అహ్మద్ కేసు దర్యాప్తు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

కోటబొమ్మాళి: శ్రీజగన్నాథపురం పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గుంట సోమేశ్వరరావు మంగళవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు తక్షణమే శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. వివరాల్లోకి వెళితే.. శ్రీజగన్నాథపురంలో 2023-24లో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి మంగళవారం సామాజిక తనిఖీలు నిర్వహించారు. సోమశ్వరరావుపై పలు అవినీతి ఆరోపణలు రావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

టెక్కలి: నౌపడా-మెళియాపుట్టి రోడ్డులో సన్యాసినీలాపురం వద్ద బుధవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నర్సింగపల్లి గ్రామానికి చెందిన కడియాల మహేష్, లంకపాడుకు చెందిన జన్ని వీరేసు గాయపడ్డారు. వీరిని 108 వాహనంపై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టైపిస్ట్‌కు సంజాయిషీ నోటీసు

గుజరాతీపేట: శ్రీకాకుళంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న జి.రామచంద్రకు సంజాయిషీ నోటీసు జారీ చేసినట్టు డీఈవో ఎస్.తిరు మల చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021 ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ ఏడాది 25 ఫిబ్రవరి 2024 తేదీ వరకు అనుమతి లేకుండా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారన్నారు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 26న విధులకు హాజరై తిరిగి 28వ తేదీ ఫిబ్రవరి 2024 నుంచి విధులకు గైర్హాజరయ్యారు. ఎన్ని నోటీసులు జారీ చేసినా.. విధుల్లో చేరలేదని, అలాగే విచారణాధికారి నివేదికలో టైపిస్ట్ రామచంద్ర విధులకు గైర్హాజర్ అయినట్టు నిర్ధారణైందన్నారు. సంజాయిషీని 10 రోజుల్లో సమర్పించాలని ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చామన్నారు. సంజాయిషీ ఇవ్వకుంటే విధుల నుంచి శాశ్వతంగా తొలగించనున్నట్టు పేర్కొన్నారు.

క్రిమినల్ కొత్త చట్టాన్ని రద్దు చేయాలి


కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

గుజరాతీపేట: క్రిమినల్ కొత్త చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా కోర్టు ముఖద్వారం వద్ద బుధవారం ఉదయం ధర్నా నిర్వహించారు. సంఘ నాయకుడు ఎం.అప్పారావు మాట్లాడుతూ.. ఈ చట్టాలు పౌరహక్కులు, స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందన్నారు. భారతీయ న్యాయం సంహిత 2023 బీఎన్ఎస్, భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 బీఎన్ఎస్ఎస్, భారతీయ సాక్ష్య అధినియం 2023 బీఎస్ఏ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.రమణరావు, కోర్టు కమిటీ అధ్యక్షుడు డి.ఈశ్వరరావు, న్యాయవాదులు పి.లక్ష్మీపతి, కూన అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ఇంటి స్థలాలు కొనుగోలు చేయొద్దు

ఇచ్ఛాపురం: మున్సిపాల్టీ పరిధిలో పలుచోట్ల అనుమతులు లేకుండా వేస్తున్న లేఔట్స్‌ను అడ్డుకున్నామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతులు లేని లే ఔట్స్‌లో ప్లాట్లు కొనుగోలు చేసినా, విక్రయించినా చట్ట విరుద్ధమన్నారు. ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వమని, మౌలిక వసతులు కూడా కల్పించడమని స్పష్టం చేశారు. అందువల్ల అనుమతులు లేని లే ఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దని కోరారు.

నిరుపేదలకు సాయం


సాయాన్ని అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా జిల్లా సీనియర్ మెగా అభిమాన సంఘం అధ్యక్షుడు ఎస్.సిద్ధయ్య ఆధ్వర్యంలో నిరుపేదలకు దుస్తులు, నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ.. ఈ నెల 22న చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా అభిమానులంతా గడిచిన 10 రోజులుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు. గురువారం అన్నదానం, రక్తదానం, సినీ కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అభిమాన సంఘ ప్రతినిధులు కె.మురళి, లక్ష్మణ, జి.కొర్లయ్య, సత్యం, వినోద్, కన్నారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కలిసిరాని ఖరీఫ్

- ఆశాజనకంగాలేని వరిపంట సాగు
- ప్రాజెక్టులపై దృష్టి సారించని పాలకులు
- ఆందోళనలో రైతులు


వర్షాలు లేక ఎండిపోతున్న వరిపొలం

సోంపేట: ఖరీఫ్ పంట ఈ ఏడాది కూడా నియోజకవర్గ రైతులకు కలిసొచ్చేలా కనిపించడం లేదు. ముఖ్యంగా వర్షాధారంపై ఆధారపడిన ప్రాంతాల్లో నిరాశజనకంగా కనిపిస్తోంది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదు కావడం రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. వర్షాకాలంలో అతి తక్కువ శాతం వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్ వేసుకొనేందుకు రైతులు నీరు అందడం లేదు. ముఖ్యంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో వర్షాధారంపైనే ఆధారపడుతోంది. నియోజకవర్గంలోని ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట మండలాల పరిధిలో ఖరీఫ్ వరినాట్లు తక్కువ స్థాయిలోనే జరిగాయి. కవిటి మండలంలో 3,151 ఎకరాలకు 1791 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పడ్డాయి. సోంపేటలో 9,304కు 4,109లు, కంచిలిలో 9,661కు 4,072లు, ఇచ్ఛాపురంలో 8,079కు 2278లు మాత్రమే నాట్లు పడినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 30,000 ఎకరాలకు గాను 12,250 ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయి. అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు నాట్లు వేయగా ఇప్పుడు అవి కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

సాగునీటి ప్రాజెక్టులు ఏవీ?

నియోజకవర్గంలో రైతులకు ఉపయోగపడే సరైన సాగునీటి ప్రాజెక్టులు ఏవీ లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చివరి నియోజకవర్గం కావడం వల్లే పాలకులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో మహేంద్రతనయ, బాహుదానది సముద్రంలో కలుస్తున్నాయి. వీటిని ఉపయోగించుకొనే ఆలోచనలు చేయడంలేదని వాపోతున్నారు. వంశధార జలాలు నియోజకవర్గాని తెస్తామని ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వటమే తప్ప ఇప్పటివరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. కనీసం వంశధార నీటిని అం దించేందుకు సర్వే కూడా చేయలేదంటే నియోజక వర్గంపై పాలకులకు ఎంతశ్రద్ధ ఉందో అర్థమవుతుంది. ఇప్పటికైనా పాలకులు నియోజకవర్గంలో సాగు నీటి సమస్య పరిష్కరించేందుకు ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు.

ఆ జాతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్: ప్రత్యేక గిరిజన తెగల(పీవీజీటీ) అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కేంద్ర గిరిజన సంక్షేమ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం కలెక్టర్లను ఆదేశించారు. వివిధ శాఖలపై కలెక్టర్లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్షేమశాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. వారు నివసిస్తున్న ప్రాంతాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మందస మండలం చీపి, కొత్తూరు మండలం అడ్డంగి, నందిగాం మండలం పెదగురువూరు గ్రామాలను మోడల్ గ్రామాలుగా అభివృద్ధి చేయడానికి గుర్తించామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పీవీజీటీ గ్రామాలపై వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, గిరిజన సంక్షేమాధికారి ఎం.శ్రీనివాసరావు, గృహనిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు నిధులు మంజూరు చేయండి


చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస/ పొందూరు: నియోజకవర్గ పరిధిలో కళాశాలలు ఇతర నిర్మాణాలకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. ఈమేరకు బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో రవికుమార్ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించారు. పొందూరు, డిగ్రీ కళాశాల నిర్మానానికి, పొందూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టు, సిబ్బంది నివాసాల నిర్మాణానికి, తొగరాం డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణానికి, రొట్టవలస జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి, నారాయణపురం ఆయకట్టు తిరిగి ఆధునికీకరణ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని చేయాలని కోరారు.

ఓపెన్ స్కూల్ విధానం ఉపయోగించుకోండి

సరుబుజ్జిలి: సార్వత్రిక విద్యా విధానం ద్వారా పది, ఇంటర్ చదువుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, డి.బాలరాజు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఓపెన్ స్కూల్ విధానంపై అవగాహన సదస్సు, ర్యాలీ బుధవారం నిర్వహించారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్, అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా ఉపయోగపడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, వెంకటసాయి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు, సీఆర్ఎంటి బెండి చిన్నారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే తమ్మినేని విమర్శలు

బూర్జ: కూటమి ప్రభుత్వం గెలుపును చూసి ఓర్వలేకనే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం విమర్శలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి రామ్‌జీ అన్నారు. అన్నంపేట గ్రామంలో బుధవారం విలేకరులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి సంక్షేమ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు చూసి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జగన్నాథం నాయుడు, శ్రీరాములు, జడ్డు కృష్ణ, గణపరాఅవు, వాసు, కడగల కృష్ణ, హరిబాబు, ఎస్.చ క్రధర్, పోలినాయుడు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


విజేతలను అభినందిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైం: క్రీడలతో ఆరోగ్యంతో పాటు ఉజ్వలమైన భవిష్యత్ లభిస్తుందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ నెల 10,11 తేదీల్లో జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతినగర్ కాలనీలోని స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన పోలీసు సిబ్బంది పిల్లలు, అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎస్పీని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పోలీసు ఉద్యోగుల పిల్లలు చౌదరి సుశాంత్, కె.అభిరామ్, కె.చిత్ర, ఎం.నికేష్, ఎం.పురందేశ్వరి విజేతలుగా నిలిచారు. నాలుగు విభాగాల్లో సుశాంత్ బంగారు పతకాలు సాధించగా, మిగిలిన వారు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన వారిని ఎస్పీ అభినందించారు. త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా సత్తాచాటి జిల్లా పేరు నిలబెట్టాలని ఎస్పీ ఆకాంక్షించారు. రాష్ట్ర జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు హరికా ప్రసాద్, ఉపాధ్యక్షులు జోగినాయుడు, అంతర్జాతీయ స్విమ్మర్ కాంతారావు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నను కలిసిన టీడీపీ నాయకులు



అరసవల్లి: వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని బుధవారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర జంగమ సాధికార సమితి డైరెక్టర్ విభూది సూరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

పంటలను పక్కాగా నమోదు చేయాలి

హిరమండలం: రైతులు సాగు చేసిన అన్ని పంటలను ఈ-పంట యాప్‌లో పక్కాగా నమోదు చేయాలని తహసీల్దారు బి.వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వ్యవసాయ సిబ్బంది, వీఆర్వోలతో ఈ పంట నమోదుపై సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు మండలంలో 30శాతం ఈ పంట నమోదు పూర్తయిందని, వంద శాతం పూర్తి చేసేం దుకు కృషి చేయాలని తెలిపారు. వ్యవసాయాధికారి బి.సంధ్య పాల్గొన్నారు.

నగర సంకీర్తనకు 37 ఏళ్లు

కొత్తూరు: ఇరపాడు, మెట్టూరు బిట్-3 గ్రామంలో 1987లో గ్రామ పెద్దలు అంతా కలిసి నగర సంకీర్తన కార్యక్రమాన్ని ప్రారంభించారు. హరేరామ పాటతో తెల్లవారుజామున చేపట్టే మేలుకొలుపునకు బుధవారానికి 37సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ మేరకు మహాన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి అంకుర్పారణ చేసిన మీసాల చిన్నబాబుకు సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు సమక్షంలో వాలిపల్లి దశమి, గొట్ట రాము, గేదెలరాములనాయుడు కలిసి సత్కరించారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

కాశీబుగ్గ: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో విద్యాభ్యాసం కొనసాగించాలని ప్రముఖ వైద్యుడు హెచ్.రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక విద్యావాహినీ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విలువలతో కూడిన విద్య నేర్చుకోవడం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, అధ్యాపకులు బి.కోదండరావు, దుర్యోధనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి సైనికుల్లా పనిచేస్తాం


సమావేశంలో పాల్గొన్న ఎన్ఈఆర్

రణస్థలం: బీజేపీ బలోపేతానికి సైనికుని వలే పనిచేస్తామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. సెప్టెంబరు 1 నుంచి దేశవ్యాప్తంగా ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదు రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ ఎన్‌టీఆర్ జిల్లా పెనమలూరులోని ఓ కల్యాణ వేదికలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో జరిగింది. పార్టీ అభివృద్ధికి ఏ విధంగా కృషి చేయాలో ఆమె పలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ పాల్గొని మాట్లాడారు.

ఎస్పీని కలిసిన సీఐ మోహన్‌రావు

శ్రీకాకుళం క్రైం: ఇటీవల జరిగిన సీఐ బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన దాడి మోహన్‌రావు బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఎస్పీకి పూల మొక్కను అందజేశారు. కాశీబుగ్గ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సీఐకు ఎస్పీ దిశ నిర్దేశం చేశారు.

వినాయక చవితికి శుభరాట

కంచిలి: కంచిలి స్టేట్‌బ్యాంక్ ఆవరణలో వినాయక చవిత ఉత్సవాలుకు సంబంధించి బుధవారం శుభరాట వేశారు. సిద్ధివినాయక పూజ కమిటీ వారు శాస్త్రోత్తంగా పూజలు నిర్వహించి పందిర రాట కార్యక్రమం నిర్వహించారు.

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

బూర్జ: ఎస్ఎస్ఆర్-2025 ఎన్నికల నాటికి ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేసే కార్యక్రమం పారదర్శకంగా చేయాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూత్‌లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశం బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు, కొత్తగా చేర్చాలకున్నా, ట్రాన్స్‌ఫర్ చేయాలనకున్నా, పేర్లు మార్చాలనుకున్న ప్రతి ఒక్క బీఎల్‌వో వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరపాలన్నారు. కార్యక్రమంలో డీటీ సంతోష్‌కుమార్, ఆర్ఐ వెంకటరావు, సంబంధిత అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామానికి బ్రిడ్జి మంజూరు చేయాలి


కేంద్ర మంత్రికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

సోంపేట: ఎంజీ పురం గ్రా మంలో కెనాలపై బ్రిడ్జ్ నిర్మాణానికి చేపట్టాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నా యుడికి గ్రామస్తు లు బుధవారం వినతి పత్రం అం దించారు. ఆయన కార్యాలయంలో కలుసుకొని గ్రా మసమస్యలు వివరించారు. గ్రామంలో సాగునీటి కోసం లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఉత్తరాల బ్రహ్మానందం, కృష్ణ, పి.శ్రీకాంత్, యు.ప్రసాద్ ఉన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో చరిత్ర, భౌతిక శాస్త్రం సబ్జెక్టుల బోధనకు గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో కనీసం 50 శాతం తక్కువ లేకుండా మార్కులు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా కళాశాలలో నేరుగా దరఖాస్తు చేయాలన్నారు.

- **సరుబుజ్జిలి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి మ్యాథమెటిక్స్ అతిథి అధ్యాపకునిగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23వ తేదీ తేదీ సాయంత్రం నాలుగు గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మాడుగుల నాగేంద్ర బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే రిటైర్డు ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ఎంపికలో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్‌లు, బయోడేటా, ఫోటోతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పొందూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇజ్జాడ మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న పౌరశాస్త్రం, భౌతికశాస్త్రం, ఎలక్ట్రికల్ ఒకేషనల్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో పీజీ పూర్తిచేసిన అభ్యర్థులకు అర్హులని తెలిపారు.

స్వల్పకాలిక కోర్సుల్లో శిక్షణకు..

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత స్వల్ప కాలిక కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోర్సు ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సుల్లో చేరేందుకు 18-30 ఏళ్ల లోపు వయసు ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం జాబ్‌మేళా నిర్వహించి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఫోన్ నెంబరు 79891 77887లో సంప్రదించాలన్నారు.

నగరంలో జాబ్‌మేళా రేపు

అరసవల్లి: ఇంటర్ నుంచి డిగ్రీ వరకు విద్యార్హతలు కలిగి 18-35 సంవత్సరాల మధ్య వయసు గల యువతీ యువకులకు ఈ నెల 23వ తేదీన ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని నెహ్రూ యువ కేంద్రంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐఐఎఫ్ఎల్ సమస్త ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో కస్టమర్ రిలేషన్ ఆఫీసర్, బ్రాంచ్ మేనేజర్/బ్రాంచ్ క్రెడిట్ మేనేజర్‌గా 180 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారం ఆ రోజు ఉదయం 10.00 గంటలకు బయోడేటా, ధ్రువ పత్రాలు, ఆధార్ కార్డులతో హాజరుకావాలని కోరారు.

పేర్లు నమోదు చేసుకోండి

కలెక్టరేట్: 2022-24 సంలో ఏదైనా డిగ్రీ, బి.టెక్, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జెన్‌నెక్ట్ సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, ఇందుకు ఆసక్తి ఉన్నవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటెంట్ మోడరేట్, కస్టమర్ సర్వీస్-వాయిస్ సపోర్ట్ విభాగాల్లో ఉద్యోగాలకు ఇంగ్లీషుపై నైపుణ్యం కలిగి, అర్హత, ఆసక్తి గల యువతీ యువకులకు హెచ్ఆర్ రౌండ్, టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9988853335, 95509 67353, 97049 60160 ఫోన్ నెంబర్లులో సంప్రదించాలని కోరారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీ, వేదిక, ఇతర వివరాలు మెయిల్ లేదా మెసేజ్ ద్వారా తెలియజేస్తామన్నారు.

పీజీ రెండో సెమిస్టర్ పరీక్ష వాయిదా

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించాల్సిన పీజీ రెండో సెమిస్టర్ పరీక్షను వాయిదా వేసినట్టు డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. భారత్ బంద్ కారణంగా వాయిదా పడిన ఈ పరీక్షను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్టు చెప్పారు.


అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధికారులను సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎన్.రమేష్ అధ్యక్షతన వార్డు హెల్త్ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలతో సమీక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం

లావేరు: ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లలను రక్షిద్దాం అనే అంశం పై బుధవారం మురపాక కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న బాలికలకు అవగాహన కల్పించారు. స్థానిక పాఠశాల ప్రత్యేకాధికారిణి బి.సుధ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవలన మహిళలపై జరుగుతున్న అత్యా చారాలు, హత్యలు చూస్తుంటే మహిళలు బయటకు రావడానికి చలా భయమేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికలు చదువుకు అందరు సహకరించాలని కోరారు. బాలికలు విద్యకు ప్రభుత్వం ఎంతగానో తోడ్పడు తుందని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైద్యుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలి



టెక్కలి: కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు

అరసవల్లి: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, వైద్యులు, సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక అంబేద్కర్ జంక్షన్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాణాలు పోసే డాక్టర్ల ప్రాణాలు తీయడం అత్యంత హీనమైన చర్య అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ త్వరితగతిన పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు కృష్ణవేణి, ఎం.ఆదినారాయణ మూర్తి, కె.సూరయ్య, కె.శ్రీనివాస్, ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాశరావు, డి.చందు, టి.త్రినాథరావు, ఎల్.రామప్పుడు, ఎం.రమణ, ఎ.సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు, సిహెచ్.సూర్యనారాయణ, పి.గోపాలరావు, ఆర్.అప్పారావు, కె.రమణ పాల్గొన్నారు.

- **అరసవల్లి:** కోల్‌కతా అమానుష ఘటన జరిగి రోజులు గడిచిపోతున్నాయి కానీ ప్రభుత్వాలు మాత్రం నిర్లక్ష్యంగా ప్రవర్తించడం సరికాదని, వైద్యుల భద్రతకు వెంటనే కఠిన చట్టాన్ని తీసుకురావాలని జూనియర్ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేష్ డిమాండ్ చేశారు. వైద్యురాలి హత్యాచారానికి నిరసనగా జూడాలు చేపట్టిన సమ్మె బుధవారం 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న సమ్మెలో ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని, విచారణను వేగవంతం చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు.
- **సోంపేట:** కోల్‌కత్తాలో వైద్యురాలిపై దాడికి నిరసనగా మండలం ఇస్కలపాలేం గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా హంతకుడికి ఉరిశిక్ష విధించాలని

టెక్కలి: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనను నిరసిస్తూ బుధవారం రాత్రి జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇందిరాగాంధీ కూడలి, టెక్కలి-తెంబూరు రోడ్డు జంక్షన్ ప్రాంతంలో జనసేన నాయకుడు కణితి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో యడ్ల గోపి, సలాన తేజ తదితరులు ఉన్నారు.



అరసవల్లి: రిమ్స్ ఆసుపత్రి వద్ద సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు


సోంపేట: కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం